# కొన్ని రంగురంగుల సాయంకాలాల్లో...



సాయంకాలం. అమ్మమ్మగారిల్లు. వరండా గ్రిల్‌లోంచి నక్షత్ర కిరణాలు వాలుతున్నాయి. మెత్తని గాలి వీస్తోంది. నేనొచ్చానని చిన్న పిన్ని బాబాయ్ చెల్లాయిలు వాళ్ళ పిల్లలూ వచ్చారు. చాలాకాలం తర్వాత యింత తీరిక. యిలాంటి సందడి.

పిన్ని పెద్ద మనవరాలు తను కొత్తగా కుట్టించుకొన్న గాగ్రాచోళీ వేసుకొచ్చింది. చిన్న మనవరాలు తను వేసిన బొమ్మలు చూపించింది. మనమలిద్దరూ తమ అభిమాన నటులు చిరంజీవి, జూనియర్ ఎన్‌టిఆర్, షారూఖ్ ఫోటోస్‌తో చేసిన ఆల్బమ్ చూపించారు. సచిన్, సౌరభ్ కబుర్లు చెప్పారు. పిన్ని తన సాఫ్ట్ వాయిస్‌తో యెన్నో పాటలు పాడింది. యీ పాటలు విని యెంత కాలం అయిందో.

'మన పక్కింట్లో వుండేవాళ్ళు... శ్యామలగారు బాగున్నారా,' అని అడగాలని పించింది.

కాని అడగలేదు.

పిన్నివాళ్ళు వెళ్ళిపోయారు.

అమ్మమ్మ వేడిపాలు గ్లాసుతో అందించింది. జుత్తులోకి వేళ్ళు చాపి చిన్నగా మర్దనా చేస్తూ పక్కనే కూర్చుంది.

ఆ ప్రేమ చూస్తే జీవితంలో శాంతి యెక్కడో లేదనిపించింది. నా బాధల్ని నా కష్టాల్ని నా ఆనందాలని నా సుఖాన్ని నా సంతోషాలని నా వెలితిని చెప్పుకోడానికి యింతకంటే గొప్ప ప్రేమ యెక్కడుంది.

కాని నిశ్శబ్దాన్నే అంటి పెట్టుకొన్నాను.

కాసేపటికి అమ్మమ్మ నిద్రపోయింది.

బయట వున్న వరండాలోకి వచ్చి పక్కింటి వైపు చూశాను. వాకిట్లో వెలుగు తున్న చిన్న బల్బు. కిటికీల పరదాల్లోంచి రాత్రి దీపపు పల్చని వెలుతురు ఛాయగా కనిపిస్తోంది. అటు చూస్తుంటే జ్ఞాపకాలు చిన్నచిన్న పిచ్చుకలల్లే రివ్వురివ్వున వచ్చి వాలాయి.

ఆరోజు కాలేజీ నుంచి యింటికి తిరిగి వచ్చేసరికి వరండాలో అమ్మమ్మ యెవరి తోనో మాట్లాడుతోంది. వాళ్ళని సరిగ్గా చూడకుండానే లోపలికి వెళ్ళిపోతుంటే, 'మా మనవరాలు... ఉత్కళ. యింజనీరింగ్ చేస్తోంది. కంప్యూటర్స్. మన పక్క యిల్లు కొనుక్కున్నారని చెప్పాను కదా. వీళ్ళే. శ్యామలగారు,' అని అమ్మమ్మ పరిచయం చేసింది.

ఆమె వైపు చూసాను. మెరుస్తున్న ముక్కుపుడక. పలకరింపుగా నవ్వాను.

'శ్యామలగారు లెక్చరరుగా పనిచేస్తున్నారంట.'

'యే యియర్ చదువుతున్నావ్. మా అబ్బాయి వశిష్ట కూడా యింజనీరింగ్ చేస్తున్నాడు,' అన్నారామె.

అప్పుడు చూశా అతన్ని. వుత్తరాలబ్బాయి వశిష్ట. ఫైనల్ యియర్ స్టూడెంట్.

అతను కళ్ళతో నవ్వాడు.

యితను యిక నుంచి యీ యింటి పక్కన వుండబోతున్నాడా... కాలేజీలో కళ్ళప్పగించి చూస్తుంటాడు. చాలా తక్కువగా మాట్లాడతాడు. కాలేజీలో కంప్యూటర్ ముందు కూర్చుని గేమ్స్‌తో, చాట్‌తో గడిపేవారు లేదా సినిమాలు, క్రికెట్ పబ్స్‌తో కాలక్షేపం చేసేవారు యెక్కువ. వశిష్టలా పుస్తకాలు చదివేవాళ్ళు చాలా తక్కువ. అందుకే పుస్తకాలు మా నడుమ వో మృదువైన వారధిని వేశాయి. అప్పుడప్పుడు వుత్తరాలు రాస్తుండేవాడు. అందులో పుస్తకాలు పువ్వులు మబ్బులు చోటు చేసుకునేవి.

శ్యామలగారు తనకెంతో నచ్చారని, ఆ రాత్రి అమ్మమ్మ చెప్పింది. అప్పుడు కూడా ఆ అబ్బాయి తెలుసని, వుత్తరాలు రాస్తాడని నేను చెప్పలేదు. అమ్మమ్మకి తెలీ కూడదని కాదు. చెప్పాలనిపించలేదు. పుస్తకాలలో పుటల నడుమ నెమలికన్నులు దాచుకొన్నంత భద్రంగా దాచుకున్నానా విషయాన్ని...

యీ వరండాలో నుంచుని జాజిపువ్వులు కోస్తున్నప్పుడో తెల్లారే లేచి అటూ యిటూ తిరుగుతూ చదువుతున్నప్పుడో అతను గోదారి అలలా కోనసీమ కొబ్బరాకు సవ్వడిలా చంద్రకాంత పువ్వుల వెలుగులా కనిపిస్తుండేవాడు... మెత్తటి చూపులతో.

గదిలోకి వచ్చాను. అమ్మమ్మ నిద్రలో నవ్వుతోంది పసిపాపాయిలా. పక్కగది లోంచి తాతగారి గురక చిన్నగా వినిపిస్తోంది. రాత్రి దీపపు కాంతిలో టేబిల్‌పై పోయిన వారం హైదరాబాద్‌లో కొన్న పుస్తకాలు కనిపించాయి. తెరచి వున్న కిటికీ లోంచి గదిలోకి వస్తున్న జీడిమామిడి ఆకుల గాలికి ఆ పుస్తకాలలో కొన్ని కాగితాలు రెపరెప లాడుతున్నాయి. ఆ పుస్తకాలపై బరువు పెడుతుంటే వొకానొక సాయంకాలపు పుస్తక ప్రదర్శన మనసులో మెదిలింది.

అతను మా పక్కింట్లోకి వచ్చిన కొత్తలో వో పుస్తక ప్రదర్శనకి వెళ్ళాను. పుస్తక

ప్రదర్శన చూడటం అదే మొదటిసారి. చాలా వుత్సాహంగా వుంది. స్టాల్సు చుట్టూ కుతూహలంతో వొకటే తిరగడం. చదివిన పుస్తకాలు, విన్న పుస్తకాలు చదవాలని కోరుకున పుస్తకాలు అన్నీ వొకేసారి ప్రత్యక్షం. కాని హేండ్‌బేగ్‌లో యెక్కువ డబ్బులు లేవు. అయితేనేం అన్ని పుస్తకాలని వొకసారి చూడటమే గొప్ప ఆనందం. హఠాత్తుగా ప్రదర్శన మధ్యలో యెదురైౖ లేత రావిచిగుళ్ళలాంటి చిరునవ్వు కళ్ళల్లో కదులుతుండగా, 'యెందుకని వొక్క వుత్తరానికి జవాబు యివ్వలేదు,' అని అడిగాడు.

నిశ్శబ్దంగా వుండిపోయాను.

యెందుకిట్లా గొప్ప ఆనందం యెదుట స్తబ్ధంగా వుండిపోతున్నాను.

'పోనీ రాయటం మానేద్దామనుకుంటా. కానీ మీ చూపుల్లో నా పట్ల యెలాంటి వ్యతిరేకతా కనిపించలేదు. పైగా ఆహ్వానిస్తుంటాయ్,' అదే చిరునవ్వుతో అన్నాడు.

నాకేదైనా కచ్చితంగా తెలిస్తే కదా చెప్పటానికి. యీ సంతోషం యిష్టంగా వుంటుంది. కాని యింతకంటే యెక్కువ కావాలనిపించడంలేదు. మాటల్లోకి అనువాదం కానిదేదో మనసు పసికట్టిందేమో.

యిద్దరం పుస్తకాల స్టాల్స్‌ని కలియతిరిగాం. కొన్ని పుస్తకాలలో పేరాలని అక్కడే నిలబడి చదివి వినిపించాడు. కొన్నింటిని చూపులతో స్పృశించాం. యింకొన్నింటి నునుపుతనాన్ని చేతివేళ్ళతో స్పర్శించాం. అలా ఆ సాయంకాలం అక్షరాలు కురిపించిన రంగుల్లో తడిసి ముద్దయ్యాం.

డబ్బుల కోసం తడుముకోకుండా పుస్తకాలు కొనుక్కునే సౌకర్యం యీ రోజున్నా ఆ తొలి పుస్తక ప్రదర్శన కలిగించినంత వుద్వేగం ఆనందం విస్మయం లేదీరోజు. ఆ రంగురంగుల సాయంకాలపు పరిమళవంతమైన అక్షరాల జ్ఞాపకం యిప్పటికీ శ్వాసిస్తూనే వుంది.

తిరిగి వరండాలోకి వచ్చాను. పక్షి పిల్లల కువకువలు, వరండాలో వో కొనకి చిన్న పక్షిగూడు వేలాడుతోంది, పాతగా. ఆ గూటిలో నివాసముంటున్న చిన్నచిన్న పక్షుల్ని చూస్తుంటే కువకువలాడుతోన్న వో వాన కురిసిన సాయంకాలపు జ్ఞాపకం.

చాలా యిష్టమైన లెక్చరర్‌గారి పెళ్ళి, అతనికి యిష్టమైన వ్యక్తితో. చాలా ఆనందం గా వుందీవేళ. కాలేజి వాళ్ళు, వాళ్ళ చుట్టాలు అంతా సందడిసందడిగా వుంది.

తెల్లవారుజాము వెన్నెల్లో బాజాభజంత్రీల నేపథ్యంలో వొక నేత్రద్వయం నన్ను శాసిస్తో. ఆరోజు వుదయం గోదారొడ్డుకి వెళ్ళి లాంచీ యెక్కి మధ్యాహ్నం వరకు తిరిగి వెనక్కి యిళ్ళకి బయలుదేరుతుంటే యీ సందడిని మూట కట్టుకెళ్ళగలిగితే అనిపించింది. కొంత దూరం ప్రయాణించానో లేదో హోరున వర్షం. ఆ వర్షంలో తడుస్తూనే యిళ్ళకి చేరాం.

బట్టలు మార్చుకొని అమ్మమ్మ కలిపిచ్చిన కాఫీ తాగుతూ వరండాలోకి వచ్చాను. నేల మీద పచ్చికలో వాన చినుకులు ప్రకాశిస్తున్నాయి. వాకిట్లో జాజిపువ్వులు రాలి ఉన్నాయి. కాఫీని మెల్లమెల్లగా తాగుతూ అలా యెంతసేపు నిలబడి వున్నానో... యింతలో కువకువలాడుతోన్న తేనెపిట్టలు. యెక్కడా చోటు లేనట్టు పచ్చ సంపెంగ గుబుర్లో గూడు కట్టుకొంది. గట్టిగా వో జల్లు కొడితే యిట్టే తడిసిపోతుందా గూడు. చిన్ని పిల్లలు. ఆ గూటిని తడవకుండా చెయ్యాలి. కాస్త వాన వెలిసిన యీ వేళప్పుడే చెయ్యాలి. యేం చేయడం.

లోపలికి వెళ్ళి అమ్మమ్మకి బియ్యం చెరుక్కొనే చేటని తీసుకొంటున్నానని చెప్పాను.

'యెందుకు?'

'అవి తడిసిపోతున్నాయి.'

'అవేం తడవవు.'

'లేదమ్మమ్మా తడుస్తున్నాయి.'

'చేట కప్పితే తడవ్వేంటి' వింతగా అడిగింది అమ్మమ్మ.

'పోనీ గొడుగెయ్,' అందామె నవ్వుతూ.

'భలే ఐడియా,' అమ్మమ్మ చెంప మీద చిన్న ముద్దు పెట్టి బయటికి పరిగెత్తాను.

ఆ చెట్టుపై ఆ గూడుపై గొడుగు పెట్టాలని తాపత్రయపడుతుంటే వెనకే వచ్చిన అమ్మమ్మ విశాలంగా నవ్వుతూ, 'యిదెక్కడి చోద్యమే తల్లీ. వర్షానికి పక్షి పిల్లలు తడిసిపోతాయా... ఆ తల్లికి తెలుసు వాటిని రక్షించుకోవడం. నిచ్చెన గట్టిగా పట్టుకో,' వెంకటేశాన్ని ఆదేశించింది.

'పిట్టలు అలా తడిసిపోవనుకుంటాను పాపగోరు,' వెంకటేశం అన్నాడు.

యీలోగా సాయంకాలపు కాంతి తగ్గిపోతూ తిరిగి వానజల్లు.

'తడిసిపోతావు. రా లోపలికి,' అమ్మమ్మ ఆదుర్దా.

యీ హడావుడికి వరండాలోకి తొంగిచూసి శ్యామలగారు విషయం విని పెద్దగా నవ్వేసి, 'గొడుగుల కంపెనీవాళ్ళకి మంచి యాడ్ కాన్సెప్ట్. జపాన్ వాళ్ళకో మలేషియా వాళ్ళకో అమ్మేద్దామా,' అని అడిగారు.

వాళ్ళీ పక్కకి వచ్చి యేడాది అవుతోన్నా ఆమెతో పరిచయాన్ని, చనువుని యెక్కువగా పెంచుకోలేదు.

అతను బయటికి వచ్చాడు.

వాకిట్లోకి వచ్చి చూస్తూ నిలబడ్డాడు.

నిచ్చెన యెక్కి పక్షిపిల్లలతో సహా ఆ గూటిని తీసి వరండాలో యీ మూలకి కట్టాను.

ఆ మూల గోడకి అల్లుకొన్న సన్నజాజి తీగలకి దగ్గరగా గూడు పెడుతుంటే అమ్మమ్మ, 'లైట్ యెలా వేసుకోవాలి,' అని అడిగింది.

యిదంతా చూస్తూనే వున్నాడు కాని దగ్గరికి రాలేదు. ఆ చేస్తున్న పనిలో అతనేం పార్టిసిపేట్ చేయలేదు. అంతా అయాక దగ్గరికి వచ్చి, 'భలే బాగుంది,' మెచ్చుకోలుగా అని, అమ్మమ్మ వైపు తిరిగి, 'చిన్న లైట్ వేయండి,' అని ఆమెకి చెప్పి వెళుతూవెళుతూ దగ్గరకొచ్చి మెల్లగా, 'యీ వరండాలో లైట్ యెందుకు... నువ్వూ, నక్షత్రాలూ వెన్నెలా వుండగా,' అని వెళ్లిపోయాడు.

ఆ తర్వాత రోజు సాయంకాలం కాలేజీలో కనిపించి, 'వుత్తరాలకెందుకు జవాబివ్వవూ,' అని మళ్ళీ అడిగాడు.

'యివ్వకపోతే యేమవుతుంది,' అన్నాను.

అతను వో క్షణం మాట్లాడలేదు.

తన చేతివేళ్ళవైపు కాసేపు చూసుకుంటూ వుండిపోయాడు.

మెల్లగా తలెత్తి, 'యిస్తే యేమవుతుంది,' తిరిగి అడిగాడు.

'యివ్వకపోతే యేమవుతుందో చెప్పు,' నవ్వుతూ అడిగాను.

అతను కాసేపు నా కళ్ళలోకి సాలోచనగా చూసి, యేం మాట్లాడకుండా వెళ్ళి పోతుంటే, 'వుత్తరాలు రాయవా,' అన్నాను.

అతనేం జవాబు చెప్పలేదు.

చైత్ర పుష్పపరాగ పరిమళపు వుత్తరాలని యిక ముందు అందుకోనేమోనన్న తలంపే కాస్త బెంగగా అన్పించింది.

అతని వెంటే వెళ్ళి, 'అలా నడుద్దామా,' అడిగాను.

'వూ...'

దారికి అటూ యిటూ యేపుగా పెరిగి దట్టంగా అల్లుకొన్న కొబ్బరిచెట్ల పచ్చని ఆకుల సందుల్లోంచి దోబూచులాడుతోన్న సాయంకాలపు వెలుగుదారిలో నడుస్తూ, 'యీ వూరంటే చాలిష్టం... నీకూ,' అడిగాను.

'చాలా యిష్టం. యీ వూరొదిలి యెక్కడికీ వెళ్ళాలనిపించదు,' అన్నాడు.

'యీ వూర్లో యీ కాలేజీ లేకపోతే పొరుగూరికి వెళ్ళేవాడివా,' అడిగాను.

అతను గట్టిగా నవ్వుతూ, 'వైజాగ్‌లో సీట్ వచ్చింది. జాయిన్ అయి వుండలేక వచ్చేశా,' అన్నాడు.

'అంత అందమైన విశాఖని వదిలి వచ్చేశావా,' ఆశ్చర్యపోయాను.

'వూ... యెందుకబ్బా... వేరే వూర్లు. యిక్కడ యెంచక్కా సొంత యిల్లు వుంది. అమ్మానాన్నగారికి మంచి పేరుంది. యెక్కడికో వెళ్ళడం యెందుకు,' అన్నాడు.

'పై చదువులు చదవడం, వుద్యోగం చేయడం యిష్టంలేదా?'

'యిక్కడే చేస్తా. యిక్కడున్నంతవరకూ చదువుతా,' అన్నాడు.

'యీ ప్రపంచంలో చూడాల్సినవి తెలుసుకోవల్సినవి బోల్డున్నాయి కదా. యిక్కడే వుంటే అవన్నీ ఎలా,' కుతూహలంగా అడిగాను.

'యీ చదువు యిక్కడుంది. చదువుతున్నా. పెద్దగా ఆసక్తి లేదు,' అన్నాడు.

'వొకవేళ వెళ్ళాల్సి వస్తే,' అడిగా.

'కష్టంగా వుంటుంది. అయినా యెందుకెళతాను. అన్నీ యిక్కడే వున్నాయిగా,' అన్నాడు.

'అన్నీ యిక్కడే వున్నాయా,' సాలోచనగా అన్నాను.

'మీ అమ్మగారు వాళ్ళు యిక్కడుండరుగా. బాధగా వుండదా,' అడిగాడు.

'మొదట్లో కాస్త బెంగగా వుండేది. అమ్మమ్మని విడిచి వుండాలన్నా వుండేది. కానీ జీవితంలో యెప్పుడూ వొకేచోట వొకే మనుష్యులతో కలిసుండటానికి వీలయ్యే జీవనవిధానం మన చుట్టూ లేదు. బెంగగా అనిపించే ప్రతిసారీ ఆలోచిస్తుండేదాన్ని. యీ ప్రపంచంలో యెవరో కొద్దిమంది మాత్రమే నావాళ్ళు అని అనుకోవటం, వాళ్ళు లేనందువల్ల బెంగగా ఫీలవడం విజ్ఞతేనా అనిపించింది. మా అమ్మావాళ్ళని రోజూ చూడకపోవచ్చు. కాని వాళ్ళతోనూ కొంత సమయం సెలవుల్లో గడుపుతా. యెక్కడికి వెళ్ళినా యేమయింది... మన మనస్సుల్లో వొకరి పట్ల వొకరికి బిట్టర్ ఫీలింగ్ లేనప్పుడు కలిసినప్పుడూ, కలవనప్పుడూ కూడా ఆనందంగానే వుండొచ్చు. కాని మన యెస్సన్షియల్ బీయింగ్‌తో మన జీవితం సాగాలి. ప్రతి బంధానికి ప్రతి ఆత్మీయతకి ప్రతివారి జీవితంలో కొంత ప్లేస్, కొంత సమయం ఉంటుంది. కాని మన జీవన పార్శ్వాలన్నింటినీ బేలన్స్ చేస్తూ వొకరికొకరుగా బతికే మన మనిషి అనిపించే వాళ్ళని మాత్రం వదిలి వుండలేననుకుంటా,' అన్నాను. కాస్త యెక్కువగా మాట్లాడానా అనిపించింది.

మౌనంగా నడుస్తున్నాం.

'నువ్వు యెక్కువగా ఆలోచిస్తావేం,' హఠాత్తుగా అన్నాడు.

'నువ్వూ ఆలోచిస్తావ్‌గా... నీ వుత్తరాల నిండా కవిత్వం వుంటుంది,' అన్నాను.

'నిన్ను చూస్తుంటే కవిత్వం వస్తుంది. నువ్విలా నాతో స్నేహంగా వుంటావని కాలేజీలో అందరికీ అసూయ అనుకో,' అన్నాడు.

తెల్లబోయాను.

'అంటే...'

'యెవరికైనా నీలాంటి అందమైన అమ్మాయితో స్నేహం చేయాలనే వుంటుందిగా. వాళ్ళందరికీ నువ్వు పరిచయస్తురాలివి. నాకేమో స్నేహితురాలివి,' మెరుస్తున్న కళ్ళతో నవ్వుతూ అన్నాడు.

'మనిద్దరికీ కామన్ ఆసక్తులున్నాయి. సో కుదిరింది,' చెప్పాను.

'నువ్వీ వూరు వదిలి వెళతావా,' అడిగాడు.

'చదువుకోవాలి. ప్రపంచమంతా చూడాలి. కెరీర్ పర్సనల్ లైఫ్ రెండూ ముఖ్యమే,' అన్నాను.

'అందమైన వుత్తరాలు యెవరెవరికి రాస్తావ్,' అని అడగాలనిపించిందో క్షణం. కాని అడగలేకపోయాను. అయినా అందరికీ అలా యెలా రాస్తారు. కొంత మందితో కొన్ని విషయాలే పంచుకొంటారు కదా. అలా అడక్కూడదనిపించింది.

'యీ వూర్లో నీకేం యిష్టం,' అడిగాడు.

'చాలున్నాయి.'

'అలాకాదు. దగ్గరగా. నీ మనసుకి దగ్గరగా యేం యిష్టం,' అడిగాడు.

'యీ కొబ్బరి తోటలు, గోదారి. అమ్మమ్మ, తాతగారు, ఆ పూలతోటలు... నీ వుత్తరాలు,' చెప్పాను.

అతని కళ్ళల్లో మెరుపు.

'నాకైతే నీపై తప్ప గొప్ప యిష్టం యెవ్వరి మీదా లేదు,' కాస్త వుద్వేగంగా చెప్పాడు.

వొకరి మనసులో నా మీద అంత యిష్టం వున్నందుకు మనసులో ఆనందపు గాలులు వీచాయి.

'యింటికెళదాం,' అన్నాడు.

'వూ.'

యింటికి వెళ్ళాక ఆ రాత్రి సంభాషణని డైరీలో రాసుకున్నాను.

వారం రోజుల తర్వాత శ్యామలగారింట్లో పేరంటమని అమ్మమ్మ రెడీ అవుతోంది.

'యేంటమ్మమ్మా పేరంటం,' అడిగాను.

'శ్యామలగారి అమ్మాయి గౌతమికి సీమంతం. వస్తావా,' అడిగింది అమ్మమ్మ.

వశిష్టని చూడొచ్చని, రంగురంగుల గాజుల్ని చూడొచ్చని, 'వూ...' అన్నాను.

యిద్దరం వెళ్ళేసరికి వశిష్ట ముందుగదిలో వాళ్ళ బావగారితో, బంధువులతో కబుర్లు చెపుతున్నాడు.

చూశాడు, కాని పలకరింపుగా నవ్వలేదు. కొంతమందంతే. తమకి బాగా తెలిసిన స్త్రీలు నలుగురిలో కనిపించినప్పుడు తెలియనట్టు ప్రవర్తించగలరు. చాలా రిజర్వ్‌డ్‌గా వుంటారు అందరి ముందు.

లోపలికి వెళ్ళాం.

గౌతమి రంగురంగులుగా మెరిసిపోతోంది. పసుపు కుంకుమ పన్నీరు గంధం దవనం చామంతులు గులాబీలు సమ్మిళితమైన పరిమళం. రంగురంగు మట్టి గాజుల గలగలలు. ఆమెని అలా చూస్తూ కాసేపు వశిష్ట పలకరింపుగా నవ్వలేదన్న విషయం మరిచిపోయాను.

శ్యామలగారు నన్ను చూసి నవ్వుతూ, 'అస్సలు రానేరావు.చివరికి యిల్లు కదిలి వచ్చావన్నమాట,' అని ఆగి, పక్కకి తిరిగి, 'మా వశిష్ట కాలేజీలోనే చదువు తుంది. పక్క యిల్లే. మావాడికి అసలే మొహమాటం, సిగ్గు కదా. వొకే కాలేజీవాళ్ళు పక్కపక్కనుంటే యెన్ని కబుర్లు చెప్పుకుంటారు. వీళ్ళిద్దరూ మాట్లాడుకోవటం చాలా అరుదు. ఉత్కళ చాలా నెమ్మదైన అమ్మాయి. మంచిది. యిలా మా యింటికి రావడం రెండోసారో మూడోసారో... యీవిడ మా వశిష్టకి కాబోయే భార్యకి మేనత్త,' అని పరిచయం చేసింది.

వశిష్టకి కాబోయే భార్యా... యిదేంటి యీ అబ్బాయి యెప్పుడూ చెప్పనేలేదే యీ విషయం. వుత్తరాలలో కాని, మాట్లాడుకొన్నప్పుడు కాని యెప్పుడూ చెప్పలేదే.

రాత్రి అంతా నిద్రపోయాక వరండాలోకి వచ్చాను. వాళ్ళ వరండాలో వశిష్ట. యింకా నిద్రపోని బంధువులతో కబుర్లు చెపుతూ.

లోపలికి వచ్చేశాను.

లోపలేదో మెలి పెడుతోంది. అతని చూపులు నాకోసం వెతుక్కోవడం, ఆ వుత్తరా లలో మెరుపు, అతని సంభాషణల్లో మృదుత్వం, అతనికి నచ్చిన పుస్తకాలు, నిజాయితీతో నిండిన విలువలు వొక్కొక్కటిగా గుర్తుస్తున్నాయి. యివన్నీ యేమిటి... ఆ విన్నది యేమిటి...

తన యింట్లో నలుగురి ముందూ పలకరించడానికి సాయంకాలం యెందుకు తటపటాయించటం... లీలగా తోస్తున్నాయి... స్పష్టత కనిపించడం లేదు.

తర్వాత రోజు సాయంకాలం కాలేజీకి వుత్తరం వైపున వున్న కనకాంబరం తోటలో

నడుస్తుంటే వెతుక్కుంటూ వచ్చాడు.

'యెంత బాగున్నావో రాత్రి. అలా రెడీ అయి యింటికి రావొచ్చుగా. చాలా అందంగా అచ్చు ముద్దబంతిపువ్వులా వున్నావు తెలుసా,' అన్నాడు.

నేను మౌనంగా వున్నాను.

'నువ్వొస్తావని అస్సలు వూహించలేదు. ఆశ్చర్యపోయా' అన్నాడు.

'వూహూ,' అన్నాను.

'పెద్ద వుత్తరం రాశా. యిదిగో,' అని యిచ్చాడు.

తీసుకొని పుస్తకంలో కాగితాల నడుమ వుంచాను.

'వెళుతున్నా,' అని యింటికి వచ్చాను.

వుత్తరం చదివాను.

అవే అక్షరాలు, అంతే యిష్టం, అదే మృదుత్వం.

రెండ్రోజుల తర్వాత కాలేజీ నుంచి బయటికి వస్తుంటే కనిపించి తోటవైపు వెళదామా అని అడిగాడు. వూరికి కాస్త దూరంగా వున్న కాలేజీ చుట్టూ తోటలే.

'నడు,' అన్నాను.

అతనెప్పటిలా కొత్తగా చదివిన పుస్తకం తీసుకొచ్చి అందులోంచి వో కథ చదివాడు.

ప్రేమకథ...

'యివన్నీ చదువుతుంటే నీకేమనిపిస్తుంది వశిష్ట,' అడిగాను.

'బాగుంటాయి. యిలా వుంటే బాగుండుననిపిస్తుంది,' అన్నాడు.

'యెలా?'

'యిలాంటి భావుకత్వం, ప్రేమ నిండిన అమ్మాయి జీవితాంతం తోడుగా వుంటే బాగుంటుందనిపిస్తుంది. కావాలనిపిస్తుంది,' అన్నాడు.

'నీ జీవితంలో భావుకత్వం, ప్రేమ నిండిన స్నేహాన్ని నింపుకోవాలనుకుంటున్నావా వశిష్టా,' అడిగాను.

'ఆ... నువ్వున్నావుగా,' అయోమయంగా చూస్తూ అన్నాడు.

'నేనున్నానా... యిలా నన్నెంతకాలం వున్నాను అనుకోగలవ్,' అడిగాను.

అతను కాస్త పజిల్డ్‌గా చూశాడు.

'యెంతకాలం యేంటి ఉత్కళ. నువ్వంటే యిష్టం. యెప్పుడూ వుంటావుగా,' అన్నాడు.

'నేను పొరుగూరో, పొరుగు రాష్ట్రమో, మరో దేశమో వెళ్ళిపోతే.'

'వెళ్ళిపోతావా... వద్దు,' అన్నాడు.

'యింతకీ నేన్నీ జీవితంలో యెలా వున్నానని అనుకుంటున్నావ్ లేదా యెలా వుండాలనుకుంటున్నావ్,' అడిగాను.

'యెప్పుడూ యింత స్నేహంగా, మనసుకి యింత దగ్గరగా,' అన్నాడు.

'సరే... యింతకీ నీ కాబోయే అమ్మాయి యెలా వుండాలనుకుంటున్నావ్,' అడిగాను.

తెల్లబోయాడు. అతని ముఖం పాలిపోయినట్టయింది.

'వూ... అమ్మ చెప్పిందా. తనకి యిలా పుస్తకాలు పాటలు ప్రకృతి తెలియవు. చదువుకొంది. కానీ నీలా భావుకురాలు కాదు. నిన్ను కాలేజీలో చూసినప్పుడు నువ్వెక్కువగా పుస్తకాలు చదవటం, మొక్కల్లో గడపటం చాలా నచ్చింది. నీలా అందరూ వుండరు కదా,' అన్నాడు.

'యెవరి వ్యక్తిత్వం వారిది. మరి నీకు నచ్చిన లేదా నీ మనసుకి దగ్గరగా వున్న అమ్మాయినే జీవితంలోకి తెచ్చుకోవచ్చుగా,' అడిగాను.

'యింట్లో వాళ్ళకి తను నచ్చింది. సరే, వాళ్ళ యిష్టానికే వదిలేద్దాం అనిపించింది,' అన్నాడు.

వో పుస్తకం చదువుతారు. ఆ పుస్తకంలో యేవో విషయాలు నచ్చుతాయి. వాటిని జీవితంలోకి అనువదించుకోవడానికి మాత్రం ప్రయత్నించరు. వొకవేళ చేసినా యిలానే అరకొరగా వుంటాయి.

'యింట్లో పిల్లలందరిలోకి మా యింట్లో నేనంటేనే మా అమ్మకి చాలిష్టం. తనకి

నచ్చిన అమ్మాయిని చేసుకుంటే వాళ్ళిద్దరూ పాలునీళ్ళలా కలిసిపోయి హాపీగా వుంటారు. యేమంటావ్,' అడిగాడు.

యెవరైనా పాలుగానో, నీళ్ళగానో వుంటేనే బాగుంటుందేమోనని చెప్పాలని పించింది. యేమో అలానే బాగుంటారేమో. చిన్నచిన్న సంఘటనల నుంచి యిప్పటివరకు తెలిసిన దాన్నుంచి చూస్తే యితనికి కాస్త సోమరితనం వుందా అనిపించింది. మనకి నచ్చినవి జీవితంలో నింపుకోవాలంటే కాస్త వోపిగ్గా ప్రేమగా వాటికోసం పని చెయ్యాలి. విత్తనాలు నాటాం మొలకెత్తి అవే ఫలవంతం అవుతా యనుకోలేం. కొంతమంది విత్తనాలు నాటి రోజూ నీళ్ళు పోసి ప్రేమగా పెంచు కుంటారు. వాటిని చూసి సంతోషిస్తారు. వేరొకరు యెవరికైనా పెంచమని యిస్తారు. తాము అనుకొన్నట్లు పెరగలేదనే చింత వున్నా యేదో వొకటి అనుకుం టారు. బద్ధకం కాకపోతే వాళ్ళిద్దరూ పాలునీళ్ళలా కలిసిపోతారనుకోవటం యేమిటి. తన లోపలి భావుకత్వాన్ని యెక్స్‌ప్రెస్ చేయటానికి చాలా క్లారిటీ వుండే వశిష్టలో యీ సోమరి పార్శ్వం యేమిటి.

'నీ జీవితంలోకి ఆ అమ్మాయిని తప్ప యెవ్వరినీ తెచ్చుకోవాలనే ఆలోచనే రాలేదా,' అడిగాను.

అతను నవ్వేస్తూ, 'యిప్పుడా విషయాలన్నీ యెందుకు,' అన్నాడు.

'చెప్పు వశిష్టా,' అడిగాను.

'యేంటీవేళ యింత సీరియస్‌గా నా లోపలి విషయాలని అడుగుతున్నావ్,' అడిగాడు.

'యిన్నాళ్ళు నువ్వు రాసినవి నీ లోపలి విషయాలు కావా' ఆశ్చర్యపోయా.

అతను నిశ్శబ్దంగా వుండిపోయాడు.

'నువ్వు నీ లోపలి విషయాలని నీకు కంఫర్టబుల్‌గా వున్నవాళ్ళ దగ్గర వ్యక్తపర్చు కోవచ్చు. కాని ఆ పని చేస్తున్నప్పుడు వాళ్ళని నీ జీవితంలో యెంతవరకు నింపుకో గలవనే యెరుక వుండాలి. నీ లోపల లేని స్థానం వాళ్ళకి యిస్తున్నట్లుగా ప్రవర్తిస్తే యెదుటివాళ్లు ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకొనేవాళ్ళైతే గందరగోళంగా తయా రవుతుంది పరిస్థితి. మనకి లేని భావాన్ని ప్రదర్శించి వాళ్ళకి అలా చేరువయ్యాక యిదంతా వుత్తిదే... వేరూ అంటే యెదుటివాళ్ళు డిస్టర్బ్ కారా,' మెల్లగా అడిగాను.

అతను మౌనంగా వుండిపోయాడు. యింటికొచ్చేశాను.

మర్నాటి సాయంకాలమే కలిసి, 'ఉత్కళా... ఆ అమ్మాయిని చేసుకోనని చెపుదా మనుకుంటున్నాను,' అన్నాడు.

'యెందుకు?'

'నువ్వు బాధపడుతున్నావని,' చప్పున అన్నాడు.

'అలా చెపితే ఆ అమ్మాయి బాధపడదా,' వస్తున్న నవ్వుని పైకి కనిపించకుండా అడిగాను.

'మా యింట్లోవాళ్ళు కుదిర్చింది కదా,' అన్నాడు.

అతనివైపు చూశాను. జాలేసింది. యితనికి చాలా విషయాలు తెలుసు. అపారంగా చదువుకొన్నాడు. కాని తనకేం కావాలో తెలియటంలేదా. తెలిసినా నిర్మించుకొనే వోపిక లేదా...

యిప్పుడే యెవ్వరి జీవితంలోకీ వెళ్ళాలని లేదు. వశిష్ట నిర్ణయం బాధిస్తోన్న మాట వాస్తవం. కానీ యిన్నాళ్ళు స్పష్టంగా తెలియని తనలోని వో పార్శ్వం కాస్త కాస్తగా తెలుస్తోంది. యితను నా యెసన్షియల్ బీయింగ్ కాదా... యీ విషయం అంతోయింతో అర్థమవుతోంటే యింక ఆలోచించడం వేస్టు...

'చెప్పు ఉత్కళా,' ఆదుర్దాగా అడిగాడు.

'వీలుకాదు వశిష్టా. చదువుకోవాలి. యిక్కడే వుంటానో లేదో తెలీదు. మీ యింట్లో వాళ్ళతో పాలూనీళ్ళలా కలుస్తానో లేదో తెలీదు. పాలూనీళ్ళలా కలిసిపోయే అమ్మాయని చెపుతున్నావ్‌గా... రిస్కు తీసుకోవడం యెందుకు,' అన్నాను.

అస్తమిస్తోన్న సూర్యుణ్ణి నిశ్శబ్దంగా చూస్తున్నాడు.

జాలేసిందా ముఖం చూస్తే.

'వశిష్టా... గందరగోళపడకు. నీ మనసు చెపుతుంది కాస్త నిదానంగా విను. అలా నడుచుకోగలిగితే నడుచుకో. జీవితంలో యేదైనా కావాలనుకున్నా వద్దనుకున్నా నీ లోపలి మనసే ప్రాతిపదిక. పైపై విషయాలు, చుట్టూ విషయాలు అనేక గందరగోళాలని సృష్టిస్తాయి. కాని మనం మాత్రమే వినగలిగే మన మనసు చెప్పినట్టుగా మన జీవితాన్ని మలచుకోడానికి ప్రయత్నిస్తే మనక్కావల్సింది

దొరుకుతుంది. దొరకకపోయినా ప్రయత్నించామన్న తృప్తి వుంటుంది. యే ప్రయత్నాలు చేయకుండా మనకి కావల్సింది దొరకలేదనే కంప్లైంట్ అనవసరం. ప్రకృతి నుంచి పుస్తకాల నుంచి నాకర్థమయిందది. సాధ్యమైనంత వరకూ మన లోపల లేని యిష్టాలని ప్రేమని మరొకరి ముందు ప్రదర్శించను. నావి కాని అనవాలును, యెదుటివాళ్ళకి యివ్వడానికి యిష్టపడను. యెందుకంటే అవి యెదుటి వాళ్ళని గాయం చేస్తాయి. మన చుట్టూ జరుగుతున్న విషయాలు మన చేతుల్లో లేకుండాపోయి వుండొచ్చు. మన యెసన్షియల్ బీయింగ్ కోసం అన్వేషణ మనలో వుంది. రకరకాల దుమ్ము పేరకుండా చూసుకోవాలి. యింట్లో వాళ్ళు అడిగారని వో అమ్మాయిని వొప్పుకోవటం నీకు నచ్చిన స్నేహితురాలు యేంటిదని అడిగిందని యిటు వచ్చేస్తాననటం... నో... యిదంతా చికాగ్గా వుంటుంది,' మెల్లగా చెప్పాను.

అతనికి యేమైనా అర్థం అయిందో లేదో తెలియదు.

ఆ తర్వాత కూడా అతన్నుంచి వుత్తరాలు వస్తూనే వున్నాయి.

అతను శాంత చూపుల్తో పలకరిస్తూనే వుండేవాడు.

ఆ తర్వాతి యేడాదే దేశం దాటి వెళ్ళేందుకు నా ప్రయాణ సన్నాహాలు మొదలయ్యాయి, యిష్టమైన చదువు చదువుకోవడానికి.

తర్వాతర్వాత అతన్నుంచి వుత్తరాలు మెల్లమెల్లగా ఆగిపోయాయి.

సాయంకాలం వేళ యెర్రటి దినబింబం దూరంగా కొండల మీద దిక్కులు మారుతూ యెగిసిపడుతుండగా శిశిరంలోంచి వసంతంలోకి మైదానాలు, పర్వతాలు, అరణ్యాలు ట్రాన్స్‌ఫామ్ అవుతున్న క్రమం చూస్తూ నా లోకంలోకి, నా ఆత్మకుహరంలోకి ప్రయాణం. యిలా యెన్నోసార్లు. ప్రతి ప్రయాణంలో నా వూరు నా యిల్లు నా మనుష్యులు నాతో లేరనే నొప్పి యెన్నోసార్లు అనుభవించాను. యెప్పుడూ పైకి చెప్పుకోలేకపోయాను. యీ ప్రయాణంలో మనతో కలిసి ప్రయాణించగలిగే ఆ వొకే వొక్క సహచర్యం ప్రయాణించలేదని తెలిశాక కూడా యింకా కొనసాగింపు... మనసంతా నింపేసుకోవటం... పూర్తిగా యింకించుకొనక వదులు కోలేనితనం... నిందలూ... అపార్థాలు... నిష్ఠూరాలు... యెందుకొచ్చిన రభస.

రంగురంగుల జ్ఞాపకాలని గుప్పెట్లో దాచుకొని పరదేశంలోనో పాలపుంతకి సాగే దిశలోనో బెంగేసే సమయాలలో శ్వాసించొచ్చు. యిలా సాగుతోన్న ప్రయాణంలో మెలమెల్లగా తెలిసింది నావి అనుకున్నవన్నీ... నా వూరు నా దేశం ఆ మేఘాలు ఆ గాలి ఆ పూలపరిమళం యెక్కడికీ పారిపోలేదు అవి నాలోనే వున్నాయని.

'యింకా పడుకోలేదా అమ్మడూ...' నిద్ర మధ్యలో వచ్చి అడిగింది అమ్మమ్మ.

'రావట్లేదు,' పక్కింటివైపు చూస్తూ చెప్పాను.

చూపులను గుర్తుపట్టి, 'శ్యామలగారు తరచూ నీ సంగతులు అడుగుతుంటారు. నువ్వెప్పుడొస్తావాని ఆతృంగా చూస్తున్నారు. సరిగ్గా నువ్వొచ్చేసరికి ఆవిడ బంధువు లింటికి వూరెళ్ళారు. దా పడుకో,' అంది అమ్మమ్మ.

వశిష్ట విషయాలేమైనా చెపుతుందేమోనని యెదురుచూసాను. నిరాశే మిగిలింది.

మర్నాడు వుదయం నుంచి యింట్లోనే గడిపిన నేను అలా గోదారొడ్డుకి బయలు దేరాను. వేణుగోపాలస్వామి కోవెల నుంచి గీతాలు మృదుశ్రావ్యంగా వినిపిస్తొన్నాయి. తోటకి ఆనుకొని వున్న నదివొడ్డున లంగరేసిన పడవపై కూర్చున్నా. 'ఉత్కళ' సాయంకాలపు నిశ్శబ్దంలో యిష్టమైన చిరపరిచితమైన పాట చాలాకాలం తరువాత వింటున్నట్టు ఆ స్వరం.

వెనక్కి చూశాను.

కంప్లీట్‌మెన్‌గా యెదిగిన శరీరాకృతి. వో క్షణం పట్టింది, గుర్తుపట్టటానికి.

వశిష్ట.

వచ్చి పక్కన కూర్చున్నాడు.

చేరువగా అతను... యిష్టమో స్నేహమో యిబ్బందో తెలియని చిన్ని గిలిగింత.

గోదారి గాలులలతో ముచ్చటలాడుతూ నా నుదిటిపైకి జారిన జుట్టుని పైకి తోస్తూ నా భూజాల చుట్టూ చేతులు వేస్తూ వుదయిస్తోన్న పూర్తి జాబిల్ని చూస్తూ, 'నీతో వున్న ప్రతి సూర్యోదయం, సాయంకాలాలు యెంతో కొత్తగా యిష్టంగా వుండేవి. యెప్పుడూ అలానే అర్థవంతంగా వుండాలంటే నీకోసం యెదురు చూడటమేననిపించింది. యీ నిరీక్షణకి కొనసాగింపేంటో నువ్వే చెప్పాలి,' అన్నాడు.

వశిష్ఠ చూపుల్లోనే కాదు స్పష్టత... హృదయంలో కూడా. సమయం గడుస్తోంది. అతను తిరిగి ఆదుర్దాగా నిర్ణయం యేంటని రెట్టించలేదు.

నెమ్మది. నిదానం. స్థిరత్వం- వశిష్టకి తను యిష్టపడేవి జీవనంలోకి అనువదించు కోవటంలోని సౌందర్యం అనుభవంలోకి వచ్చిందనే నమ్మకం నా వూపిరికి అందు తోంటే అతని కుడిచేతిని చేతిలోకి తీసుకొన్నా.

'థ్యాంక్ యూ,' అతని చేయి నా తలని మృదువుగా నిమురుతోంది.

చప్పున అతని చెవితమ్మిని కాస్త కసిగా కొరికా.

'అబ్బా... యేంటిది,' అతను చెవిని చేతివేళ్ళతో రాసుకొంటూ అన్నాడు.

'యింతకాలం నన్ను దూరంగా, వుంచి బోర్ కొట్టించినందుకు శిక్ష,' అన్నాను.

'నీ శిక్ష నిజంగా గమ్మత్‌గా వుంది. మరి కొంతకాలం...' చిలిపిగా అంటున్న వశిష్ఠ మెడ వొంపులో నా ముఖాన్ని అన్చుతూ, 'నో వే,' అన్నాను.

ఆ సాయంకాలం మా మనోస్పర్శతో రంగురంగులుగా వెలిగింది.



ఆదివారం ఆంధ్రజ్యోతి
*11 ఏప్రిల్ 2004*